# సత్యవాక్యం

# The Word of Truth

క్రైస్తవ మాసపత్రిక

NOVEMBER 1997

## సంక్షిప్త వార్తలు

1997అక్టోబరు 11వ తేదీ శనివారం తూ॥గో॥జిల్లా పెద్దాపురం మండల ప్రాంతపు సువార్తికుల సదస్సు గుడివాడలో జరిగెను. ఈ సదస్సును ప్రతినెల రెండో శనివారంలో ఆయాగ్రామములలో సోదరులు T.ch. ఫ్లెమింగ్స్ గారు నిర్వహించుచున్నారు. అక్టోబరు నెల సదస్సులో M.యేసుపాదం (పెద్దాపురం), నందిక మోషే (యెర్రంపాలెం), T.భాస్కరరావ్ (కొవ్వూరు), తాతపూడి ఆనందరావ్ (సూరంపాలెం), T.ch. ఫ్లెమింగ్స్ (గుడివాడ), A. విశ్వేశ్వరరావ్ (ఆదికరేవుల) మరియు జామవా గౌతం గార్లు వాక్యోపదేశం గావించిరి. పలుగ్రామములనుండి వచ్చిన సభ్యులకు గుడివాడ క్రీస్తు సంఘము చక్కటి ఆతిథ్యమిచ్చిరి.

విజయవాడ దుర్గాపురం క్రీస్తుసంఘము తమ ఆరాధన, సంఘకార్యక్రమముల కొరకు దగ్గిరలోనే యున్న ధర్మాపురంలో కొనుగోలు చేసిన నూతన వసతిలోనికి అక్టోబరు 16వ తేదీ గురువారం సాయంత్రం సోదరులు G.మార్కు (నందిగామ)గారి ప్రార్థనతో ప్రవేశించిరి. ఆనాడు సోదరులు I. ఇశ్రాయేలు(తిరువూరు), P. షద్రక్ (గన్నవరం), G.మార్కు (నందిగామ), P. అబ్రాహాం (ముత్యాలపాడు), K.జాన్ బెర్నార్డ్(గుణదల), భోజరాజు (వెలగలేరు), జాన్‌పాల్ (ప్రకాశనగర్), సాల్మన్‌రాజు (మధురానగర్) వాక్యపరిచర్య చేసిరి. ఇంచుమించు 200 మంది ఆ కూటమునకు హాజరైరి. మరియు స్థానిక (ధర్మాపురం) క్రీస్తుసంఘము చక్కటి భోజన వసతుల నేర్పాటు చేసిరి. దుర్గాపురం, ధర్మాపురం ఏరియాలోను, విజయవాడలోను సోదరులు K. రాజ్‌కుమార్ గారు క్రీస్తు కొరకు మంచి పనిచేయుచున్నారు. ఆనాటి కూటము రాజ్‌కుమార్ గారి వందన సమర్పణతోను, ప్రార్థనతోను ఆనందదాయకముగా ముగించబడెను.

అక్టోబరు నెల సువార్తికుల సదస్సు 28వ తేదీన కాకినాడస్కూల్ ఆఫ్ ప్రీచింగ్ సెమినార్ హాల్ నందు ఘనంగా జరిగెను. సుమారు 500మంది సువార్తికులు, విద్యార్థులతో సెమినార్ హాల్ కళకళలాడెను. ఈ సదస్సుకు నిర్దిష్టమైన అంశము లేకపోయినప్పటికిని, సువార్తికులు అనేక ప్రాముఖ్యాంశములపై చక్కని వర్తమానములను అందించగా అందరికిని ఆదరణ, ఆనందము, ఆత్మీయ క్షేమాభివృద్ధి కలిగెను.

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

Phone : 0884-63722

**Editor :** **J.C.CHOATE**

**Managing Editor :** **JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 18 నవంబరు 1997 సంచిక 4

## సంపాదకీయం

## క్రీస్తుయొక్క పునరుత్థానము

## ( The Resurrection of Christ )

మానవుని రక్షణ, సంఘము యొక్క ఉనికి, క్రైస్తవ్యము అంతా క్రీస్తు యొక్క పునరుత్థానము మీదనే ఆధారపడియున్నవి. క్రీస్తు యొక్క విరోధులు దానిని తిరస్కరిస్తారుగాని, అదొక యదార్థమని నిరూపించు అనేక వాస్తవములున్నవి. యేసుప్రభువు దేవాలయములోని వ్యాపారులను పారద్రోలిన తరువాత అట్టి పనులు చేయుటకు ఆయనకున్న అధికారమును నిరూపించుట కొరకు ప్రజలు ఒక సూచకక్రియను అడుగగా, "యేసు -ఈ దేవాలయమును పడగొట్టుడి,మూడు దినములలో దానిని లేపుదునని వారితో చెప్పెను. యూదులు, ఈదేవాలయమును నలువదియారు సంవత్సరములు కట్టిరే; నీవు మూడుదినములలో దానిని లేపుదువా అనిరి. అయితే ఆయన తన శరీరమను దేవాలయమును గూర్చి యీ మాట చెప్పెను. ఆయన మృతులలోనుండి లేచిన తరువాత ఈ మాటచెప్పెనని ఆయన శిష్యులు జ్ఞాపకము చేసికొని, లేఖనమును యేసుచెప్పిన మాటను నమ్మిరి" (యోహాను 2:19-22).

లాజరు చనిపోయిన తరువాత యేసు అక్కడికి వెళ్లగా, ఆయన అక్కడ ఉండి యున్నట్లయితే లాజరు చనిపోవకపోవునని మార్త పలుకగా, తన సహోదరుడు మరల బ్రదుకునని యేసు జవాబిచ్చెను. అయితే ఆయన అంత్యదినమందు సంభవింపబోవు పునరుత్థానమును గూర్చి చెప్పెనని మార్త తలంచెను. "అందుకు యేసు-పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును; బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు. ఈ మాట నమ్ముచున్నావా? అని ఆమెనడిగెను" (యోహాను 11:22-26). యేసు లాజరు సమాధి యొద్దకు వెళ్లి అతనిని మృతులలోనుండి సజీవునిగా లేవనెత్తెను.

మత్తయి, మార్కు, లూకా,యోహాను సువార్తలలోని ఆఖరిభాగంలో యేసుప్రభువు యొక్క మరణ సమాధి పునరుత్థానములను గూర్చి మనం చదువు తాము. యిది చరిత్రలో నిజముగా గొప్ప సంఘటనే, అంతేకాదు చాల విషాదకర మైనది. అరిమతయి యోసేపు సమాధిలో ఆయన శరీరమును పాతిపెట్టగానే ఆయన కథనము ముగిసిపోయిందని ఆయన శత్రువులు తలంచారు. అయితే ఆయన చెప్పిన రీతిగానే మూడవదినమున సమాధినుండి విజయవంతుడై తిరిగి లేచెను. "విశ్రాంతి దినము గడచిపోయిన తరువాత ఆదివారమున తెల్లవారుచుండగా మగ్దలేనే మరియయు, వేరొక మరియయు సమాధిని చూడవచ్చిరి. ఇదిగో ప్రభువు దూత పరలోకమునుండి దిగి వచ్చి రాయి పొర్లించి దానిమీద కూర్చుండెను. అప్పుడు మహా భూకంపము కలిగెను. ఆ దూత స్వరూపము మెరుపువలె నుండెను. అతని వస్త్రము హిమమంత తెల్లగా ఉండెను. అతనికి భయపడుటవలన కావలివారు వణకి చచ్చినవారి వలెనుండిరి. దూత ఆ స్త్రీలను చూచి, మీరు భయపడకుడి, సిలువ వేయబడిన యేసును మీరు వెదకుచున్నారని నాకు తెలియును. ఆయన ఇక్కడలేడు. తాను చెప్పినట్టే ఆయన లేచియున్నాడు.; రండి ప్రభువు పండుకొనిన స్థలమును చూచి త్వరగా వెళ్లి ఆయన మృతులలోనుండి లేచియున్నాడని ఆయన శిష్యులకు తెలియజేయుడి. ఇదిగో ఆయన గలిలయలోనికి మీకు ముందుగా వెళ్లుచున్నాడు; అక్కడ మీరు ఆయనను చూతురు; ఇదిగో మీతో చెప్పితి ననెను" (మత్తయి 28:1-7).

యేసు సమాధి చేయబడినప్పుడు ప్రధాన యాజకులు పిలాతునొద్దకు వెళ్లి ఆయన శరీరమును ఎవడు ఎత్తికొనక పోకుండు నిమిత్తము సమాధి యొద్ద కావలివారి నుంచవలెనని వేడుకొనిరి (మత్తయి 27:64). అయితే ఆదివారమున తెల్లవారుచుండగనే మహా భూకంపము కలిగెను, ప్రభువుదూత పరలోకమునుండి వచ్చి రాయి పొర్లించి దానిమీద కూర్చుండెను. కావలివారు వణకి చచ్చినవారివలె నుండిరి. వారాభయమునుండి తేరుకొనిన తరువాత జరిగిన సంగతులను ప్రధాన యాజకులతో చెప్పిరి. కాబట్టివారు సైనికులకు చాల ద్రవ్యమిచ్చి మేము నిద్రపోవు చుండగా అతని శిష్యులు రాత్రివేళ వచ్చి అతనిని ఎత్తికొని పోయిరని చెప్పమనిరి. మరియు ఇది అధిపతి చెవిని బడిన యెడల మేమతని సమ్మతిపరచి మీకేమియు తొందర కలుగకుండ చేతుమని వారికి చెప్పిరి.

అయితే విధి నిర్వహణలో రోమా సైనికులు నిద్రపోవుటను గూర్చి యెవరైనా విన్నారా? సరిగదా డ్యూటీలో నిద్రపోయామని చెప్పుటకు అట్టి వారెన్నడైనా బ్రతికారా? రోమా సైనికుడు తన కావలిలో యున్న వానిని పారిపోనిచ్చాడంటే దానికి ప్రతిగా తన ప్రాణమును కోల్పోవలసినదే యను రోమా దేశపు చట్టాన్నిఅందరు ఎరిగే యుందురు. అయితే యేసు తిరిగి లేచెనను వాస్తవాన్ని ప్రధాన యాజకులు అంగీకరించలేకపోయారు. అందువలన ఒక అబద్ధాన్ని ప్రచారం చేయుటకు గాను కావలి వారికి వారు లంచము నియ్యవలసి వచ్చినది. నాటి శత్రువులు, నేటిశత్రువులు ఎన్ని అబద్ధములు ప్రచారము చేసినను సరే, యేసు నిజానికి సమాధినుండి తిరిగి లేచారు.

ఆయన లేచిన తరువాత నలుబది దినముల మట్టుకు అపొస్తలులకు శిష్యులకు వివిధ సమయాల్లో ఆయన అగుపడుచుండెను. ఆయన పునరుత్థానమును గూర్చి అనేకమంది సాక్షులుండిరి. మొదటిగా ఆయన సమాధిని దర్శింప వచ్చిన స్త్రీలు ఆయనను చూచిరి. తరువాత ఎమ్మాయుకు పోవు మార్గములో ఇద్దరు మనుష్యులు తరువాత అపొస్తలులును ఆయనను చూచిరి. "ఆయన కేఫాకును తరువాత పండ్రెండు గురికిని కనబడెను. అటు పిమ్మట ఐదువందలకు ఎక్కువైన సహోదరులకు ఒక్క సమయమందే కనబడెను. వీరిలో అనేకులు ఇప్పటివరకు

నిలిచియున్నారు. కొందరు నిద్రించిరి. తరువాత ఆయన యాకోబుకును, అటు తరువాత అపొస్తలులందరికిని కనబడెను. అందరికి కడపట అకాలమందు పుట్టినట్టున్న నాకును కనబడెను" అని అపొ.పౌలు వ్రాసెను (1కొరింథీ 15:5-8).

ప్రభువు పరలోకమున కారోహణము కాకముందు, అపొస్తలులు పైనుండి శక్తిపొందువరకు యెరూషలేములో నిలిచి యుండవలెనని వారికి చెప్పెను. అక్కడనుండి వారు ఆయన మరణ, సమాధి, పునరుత్థానములను గూర్చిన సువార్తను యెరూషలేములోను, యూదయ సమరయ ప్రాంతముల యందును, భూదిగంతముల వరకును ప్రకటించవలసియుండెను (లూకా 24:29; అపొ.కా. 1:8; మార్కు 16:15,16).

వారు యెరూషలేములో కనిపెట్టుచుండగా ఇస్కరియోతు యూదా స్థానమును భర్తీ చేయుటకు ఒకనిని ఎంచుకొనిరి. అయితే అట్టివాడు యేసు యోహానుచే బాప్తిస్మము పొందినది మొదలు మరణమునుండి తిరిగి లేచిన దినము వరకు యున్న సంగతులను గూర్చిన ప్రత్యక్ష సాక్షియై యుండవలెను. మత్తయి అనునతడు పన్నెండవ వానిగా ఎంచుకొనబడెను. వారు పరిశుద్ధాత్మ శక్తినొందిన తరువాత అపొస్తలులు యేసును దేవుడు లేపెనని బోధింప మొదలిడిరి (అపొ.కా. 2:24; 29-32). తత్ఫలితముగా మొదటి దినమందే మూడువేలమంది ఆయన నిజముగా లేచెనని విశ్వసించిరి. బాప్తిస్మము పొందిరి. దేవుడు వారిని తన సంఘముతో చేర్చుకొనెను (అపొ.కా. 2:37-47).

అపొ.పౌలే క్రీస్తు పునరుత్థానమును గూర్చిన బలమైన యొక బుజావు. అతడు సౌలుగా యున్నప్పుడు యెరూషలేము ప్రాంతములోని క్రీస్తు సంఘమును ఘోరముగా హింసించాడు. దమస్కులోని క్రైస్తవులను బంధించి యెరూషలేముకు కొనిపోవుటకు ప్రధాన యాజకుల నుండి అనుమతి బొంది అక్కడకు వెళ్లుచుండగా, ప్రభువు అతనికి మార్గములో కనబడి, "సౌలా, సౌలా నీవేల నన్ను హింసించుచున్నావు? అని అడిగెను (అపొ.కా. 9:4). "ప్రభువా, నీవెవరవని అతడడుగగా ఆయన, నేను నీవు హింసించుచున్న యేసును. నీవు లేచి పట్టణములోనికి వెళ్లుము; అక్కడ ఏమి

చేయవలెనో అది నీకు తెలుపబడునని చెప్పెను" (అపొ.కా. 9:5-6). సౌలు లేచి వెళ్లెను. మూడు దినములు నిద్రాహారములు లేక ప్రార్థించుచు గడిపిన తరువాత అతనికి అననీయ అననతడు క్రీస్తులోనికి బాప్తిస్మమిచ్చెను (అపొ.కా. 22:16). అతడు వెంటనే యూదుల సమాజ మందిరములలో క్రీస్తును గూర్చి ఆయన దేవుని కుమారుడని బోధించుట కారంభించెను. తరువాత అతడు పౌలుగా మారి, దేవుని గొప్ప సేవచేసెను. చివరకు క్రీస్తు కొరకు హతసాక్షిగా మరణించెను.

అయితే అతనిలో ఇంత గొప్ప మార్పు ఎట్లు వచ్చెను? సౌలు క్రీస్తు సంఘమును హింసించినను అజ్ఞానమువలన అట్లు చేసెను. క్రీస్తు ఒక మోసగాడని, దేవుని మార్గమునకు ప్రమాదము కలుగ జేయువాడని అతడు తలంచాడు. అయితే ప్రభువు అతనికి కనబడగా, క్రీస్తు బ్రదికియున్నాడని, అపొస్తలులు చెప్పినట్లు ఆయన బ్రదికే యున్నాడని, ప్రధాన యాజకులు అబద్ధికులని అతడు వెంటనే గుర్తించాడు. అందువలన అతడు ప్రభువు తట్టు తిరిగి, ఆయన పునరుత్థానుడైన క్రీస్తని ప్రజలకు తన జీవితాంతము వరకు ప్రకటించాడు.

సువార్తయనగా క్రీస్తు యొక్క మరణ సమాధి పునరుత్థాన వాస్తవములే (1కొరింథీ 15:1-4). అది మంచివార్త యని అతడు చెప్పాడు (రోమా 10:13-15). మనము బాప్తిస్మము పొందినప్పుడు క్రీస్తు యొక్క మరణ సమాధి పునరుత్థానముల సాదృశ్యములో పాలుపొందుదుము (రోమా 6:3-4).

మరియు క్రైస్తవులుగా ప్రతి ఆదివారమున ఆరాధనకు కూడుకొందుము (అపొ.కా. 20:7). ప్రతి ఆదివారమున ప్రభురాత్రి భోజనములో పాల్గొనుట ద్వారా క్రీస్తుయొక్క మరణ, సమాధి, పునరుత్థానములను ప్రకటింతుము (మత్తయి 26:26-28; 1కొరింథీ 11:23-29). అట్లు చేయడంలో క్రీస్తు పునరుత్థానుడయ్యారని, ఇప్పుడు సజీవంగా యున్నారని, మరల రాబోవుచున్నారని ఈలోకానికి గంభీరముగా ప్రకటింతుము.

చివరిగా, క్రీస్తుయొక్క మరణ సమాధి పునరుత్థానముల వలన, మనందరము ఆఖరిదినము లేపబడుదుమనే వాగ్దానమును పొందియున్నాము. "దీనికి

ఆశ్చర్యపడకుడి; ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్న వారందరు ఆయన శబ్దము విని మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడుచేసి వారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు" (యోహాను 5:28-29). నీవు యేసుక్రీస్తు పునరుత్థానము నందు విశ్వాసముంచుచున్నావా?

## పరలోక రాజ్యపు తాళపు చెవులు

## ( The Keys of the Kingdom )

"పరలోకరాజ్యపు తాళపు చెవులు" అను అంశమును తెలిసికొనుటకు ముందు దేవుని రాజ్యమును గూర్చి తెలిసికొనుట ఎంతైనా అవసరం. ఏలయనగా 1. బాప్తిస్మమిచ్చు యోహాను "పరలోకరాజ్యము" సమీపించియున్నది, మారుమనస్సు పొందుడని ప్రకటించెను (మత్తయి 3:1,2). 2. యేసుక్రీస్తు "పరలోకరాజ్యము" సమీపించియున్నది మారుమనస్సు పొందుడని ప్రకటింప మొదలుపెట్టెను (మత్తయి 4:17). 3. యేసుక్రీస్తు శిష్యులను పంపుచు "పరలోకరాజ్యము" సమీపించియున్నదని ప్రకటించమని చెప్పెను (మత్తయి 10:6,7). 4. యేసు "రాజ్యము"ను దయచేయుమని ప్రార్థించమని శిష్యులకు నేర్పెను (మత్తయి 6:10). 5. యేసుక్రీస్తు ఆరోహణమగుటకు ముందు శిష్యులు ప్రభువా ఈకాలమందు ఇశ్రాయేలీయులకు రాజ్యము మరలా అనుగ్రహించెదవా? అని అడిగిరి (అ.కా. 1:6). కావున పరలోకరాజ్యమును తెలిసికొనుట అత్యంతావశ్యకమై యున్నది.

సాధారణముగా రాజ్యము అనగానే దానికి ముఖ్యమైన 4 అంశములుండును. 1. కొన్ని సరిహద్దులు గల భూభాగము 2. రాజు 3. ప్రజలు 4. చట్టము వుండును. దీనినే రాజ్యమందురు. అయితే దేవుని రాజ్యము సంగతి ఏమి? దీని విషయమై పరిశీలిద్దాము.

బైబిలునందు 1. పరలోకరాజ్యము 2. దేవునిరాజ్యము అని చెప్పబడినదది. ఈరెండును వేరువేరుగాక ఒకటియై యున్నది. అనగా ఒకదానికొకటి పర్యాయ పదముగా చెప్పబడినది. దేవుని రాజ్యము అనగానేమి? "దేవునిరాజ్యము "భోజనము పానమును కాదుగాని, నీతియు సమాధానములను పరిశుద్ధాత్మ యందలి

ఆనందమునైయున్నది" (రోమా 14:16,17). మరి యీ రాజ్యము 1. భూమిమీద స్థాపించబడినదా? 2. ఎప్పుడు స్థాపించబడినది? 3. ఎక్కడ స్థాపించబడినది? 4. ఆరాజ్యమేది? మొదలగు విషయములను తెలిసికొందము.

**I.** దేవుని రాజ్యము భూమిమీద స్థాపింపబడినదా? ఈ రాజ్యమును గూర్చి దేవుడు ముందుగానే నిర్ణయించియున్నాడు. దేవుడు ".... తన చిత్తప్రకారమైన దయా సంకల్పము చొప్పున... జగత్తు పునాది వేయబడక మునుపే ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను" (ఎఫెసీ 1:6). ఇది నిత్యసంకల్పము (ఎఫెసీ 3:8). ఈరాజ్యమును గూర్చి ముందుగానే ప్రవచింపబడియున్నది.

1. యెషయ: అంత్యదినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండలకంటే ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్లు సమస్త జనులు దానిలోనికి వచ్చెదరు" ( యెషయ2:2,3).

2. సమూయేలు: "నీ దినములు సంపూర్ణములగునపుడు నీవు నీ పితరులతో కూడ నిద్రించిన తరువాత నీ గర్భములో నుండి నీ సంతతిని హెచ్చించి రాజ్యము అతనికి స్థిరపరచెదను. అతడు నా నామ ఘనత కొరకు ఒక మందిరమును కట్టించును; అతని రాజ్యసింహాసనమును స్థిరపరచెదను" (2సమూ 7:12,1). 1ది.వృ. 17:11,12 చూడుము.

3. మీకా: "...యాకోబు దేవుని మందిరమునకు, యెహోవా పర్వతమునకు వెళ్లుదము రండి, ఆయన తన మార్గముల విషయమై బోధించును.." (మీకా 4:1,2).

పై తెలిపిన యెషయ, మీకా ప్రవచనములలో 1. యెహోవా పర్వతము 2. యెహోవా (దేవుని) మందిరము అను అంశములు బయలు పరచియున్నాడు. ఈ అంశములను బాగుగా పరిశీలించిన పర్వతము, మందిరము అనునవి రెండు

వేరువేరుగాక ఒకటియైయున్నది. అనగా ఈ రెండును ఒకదానికొకటి పర్యాయపదములై యున్నవి.

సమూయేలు ప్రవచనంలో రాజ్యము (రాజ్యసింహాసనము) మందిరము అని చెప్పుచు అతడు నా నామ ఘనత కొరకు మందిరము కట్టించును. అతని రాజ్యసింహాసనమును స్థిరపరచెదనని చెప్పుచున్నాడు. కొందరు సమూయేలు ప్రవచనమును 1. సంతతి 2. మందిరము అను విషయములను తప్పుగా అర్థము చేసికొని సంతతి యనగా, దావీదు తరువాత అతని సంతానమని , మందిరమనగా యెరూషలేములో సొలొమోను కట్టించిన దేవాలయమని బోధించుచున్నారు. ఇది ఒక్కిలి విచారకరమైన సంగతి. ఏలయన? సంతతి యనగా దావీదు తరువాత అతని సంతతి వారుకాదు; మందిరమనగా దేవాలయము అంతకంటే కాదు. ఈ వాస్తవమును పై లేఖనములే వివరించుచున్నవి.

సంతతి:- దేవుడు ఇస్సాకుకు గెరారులో ప్రత్యక్షమై తాను అబ్రహాముకు చేసిన నిబంధనను ఇస్సాకుతో స్థిరపర్చుచు యిట్లనెను: "...ఈ దేశమందు పరవాసివై యుండుము. నేను నీకు తోడై యుండి నిన్ను ఆశీర్వదించెదను. ఏలయనగా నీకును నీ సంతానమునకును ఈ దేశములన్నియు యిచ్చి, నీ తండ్రియైన అబ్రహాముతో నేను చేసిన ప్రమాణమును నెరవేర్చి, ఆకాశ నక్షత్రముల వలె నీ సంతానమును విస్తరింపజేసి యీ దేశములన్నియు నీ సంతానమునకిచ్చెదను. నీ సంతానము వలన సమస్తభూలోకములోనిసమస్త జనులు ఆశీర్వదించబడుదురు" (ఆది 26:2-4). ఈ లేఖనభాగము లో "నీ సంతానము వలన .... సమస్తజనులు ఆశీర్వదించబడునని వున్నది. ఈ సంతానము ఎవరు? ఇస్సాకు సంతతి వారా ? కాదు. "సంతానము" అనగా ఇస్సాకు సంతతివారు కానేకాదు. పరిశుద్ధాత్ముడు అపొస్తలుడైన పౌలు ద్వారా "ఆ సంతానము క్రీస్తే" యని బయలు పరచెను. "అబ్రహామునకును, అతని సంతానమునకును వాగ్దానములు చేయబడెను. ఆయన అనేకులను గూర్చి అన్నట్టు-సంతానములకును అని చెప్పక, ఒకని గూర్చి అన్నట్టే నీ సంతానమునకు అనెను. ఆ సంతానము క్రీస్తు" (గలతీ3:16).

2. మందిరము:- మందిరమనగా యెరూషలేము దేవాలయమని పొరబడు చున్నారు. మందిరమనగా దేవాలయముకానే కాదని ఆ లేఖనమే రుజువు చేయుచున్నది. ఏలయన? యెరూషలేము దేవాలయము నాశనము గావించ బడినది. మందిరమును గూర్చి లేఖనములేమి చెప్పుచున్నవి? 2సమూ 7:13లో అతని రాజ్యసంహాసనమును నిత్యముగా స్థిరపరచెదనని తెలియచేయుచున్నది. దీనిని బట్టి మందిరమనగా యెరూషలేము దేవాలయము కాదని స్పష్టమైనది. మరి మందిరమనగానేమి? అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాస్తు '... అయినను నేను ఆలస్యము చేసిన యెడల దేవుని మందిరములో అనగా జీవముగల దేవుని సంఘములో జనులేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెనని యీ సంగతులు నీకు వ్రాయు చున్నాను" అనెను (1తిమో 3:14,15). కాబట్టి మందిరమనగా సంఘము అని తెలియుచున్నది. ఈ సంఘమే దేవుని రాజ్యమని పరిశుద్ధగ్రంధము వక్కాణించుచున్నది. ఏలయన? యేసుక్రీస్తు మత్తయి 16:18లో సంఘము స్థాపించెదనని చెబుతూ 19వ వచనములో పరలోకరాజ్యపు తాళపుచెవులు యిస్తానని పేతురుతో చెప్పుచున్నాడు. మరియు ఆయన నికోదేముతో "ఒకడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని చెప్పెను (యోహాను 3:5). నీటిమూలముగాను, ఆత్మమూలముగాను అనగా బాప్తిస్మము ద్వారా తిరిగి జన్మించువారు సంఘములో చేర్చబడుచున్నారు (అపొ.కా. 2:41,47).

పై లేఖనములను జాగ్రత్తగా గమనించిన దేవుని పర్వతము, మందిరము, రాజ్యము సంఘము ఒక్కటేయని తేటపడుచున్నది. అయితే రాజ్యము, పర్వతము, సంఘము అనే రాజ్యము స్థాపించబడినదా? దీని విషయమై బైబిలు ఏమి చెప్పుచున్నదో పరిశీలిద్దాము.

1. మార్కు 9:1 :- యేసుప్రభువు "ఇక్కడ నిలిచియున్నవారిలో కొందరు, దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచి చూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను (మత్తయి 16:28 చూడుము).

ఈ వాక్యములలో 3 ముఖ్యమైన విషయములు గోచరమగుచున్నవి. 1. శిష్యులలో కొందరు బ్రదికి యుండగానే రాజ్యము స్థాపించబడుట. 2. రాజ్యము స్థాపించబడనిచో శిష్యులలో కొందరు యింకను బ్రదికి యుండుట. 3. రాజ్యమురాక, శిష్యులు బ్రదికియుండనిచో యేసు అబద్ధికుడైయుండవలెను. (1) యేసు దేవుని కుమారుడు, దేవుడు. కనుక అబద్ధమాడువాడుకాడు. (తీతు 1:4 చూడుము). (2) యేసుక్రీస్తు శిష్యులలో (శిష్యులేకాదు; ఆనాటివారెవరును) బ్రదికియుండ లేదనుట జగద్విదితము. (3) కాబట్టి దేవుని రాజ్యము వచ్చియేయున్నది.

2. కొలస్స 1:3:- "ఆయన మనలను అంధకారసంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా జేసెను".

ఈ వాక్యము మనకేమి బోధ చేయుచున్నది? పాపము చేసి సాతానుకు వశమైన మనలను దేవుడు ప్రేమించి అట్టి సాతాను అధికారములోనుండి విడుదల చేసి తన కుమారుని రాజ్యములో నివసింపచేయుచున్నాడని బోధించుచున్నది అనగా అప్పటికే భూమిమీద క్రీస్తుకు ఒక రాజ్యమునుండి ఆ రాజ్యములోనికి ప్రవేశపెట్టెనని తెలియుచున్నది.

3. ప్రకటన 1:6 :- పత్మాసులో బంధీయైన యోహానుకు ప్రభువు ప్రత్యక్షమై దేవుని రాజ్యమును గూర్చి యిట్లు చెప్పెను. ".... ఆయన మనలను తన తండ్రియగు దేవునికి ఒక రాజ్యముగాను, యాజకులనుగాను చేసెను.

4. ప్రకటన 5:10 :- సింహాసనాశీనులైన 24గురు పెద్దలు యిట్లు చెప్పిరి. "... నీవు వధించబడిన వాడవై నీ రక్తమిచ్చి ప్రతి వంశములోను ఆయా భాషలు మాటలాడువారిలోను, ప్రతి జనములోను ప్రతి ప్రజలోను దేవుని కొరకు మనుష్యులనుకొని మా దేవునికి వారిని ఒక రాజ్యముగాను యాజకులనుగాను చేసితివి". కాబట్టి దేవుని రాజ్యము వచ్చియేయున్నదని స్పష్టమగుచున్నది. దేవుని రాజ్యము భూమిమీదికి వచ్చియున్నదని పరిశుద్ధగ్రంధము

ఉద్ఘాటించుచున్నందుగా యింకను రాజ్యము రాలేదని ఎదురుచూచుట, ప్రార్థించుట ఎంతటి అమాయకత్వము! (సశేషం).

- జి. మార్కు, నందిగామ.

## జీవాధిపతి

### ( The Prince of Life )

అపొ.కా. 3వ అధ్యాయములో పుట్టినది మొదలు కుంటివాడయిన ఒక మనుష్యుడు పేతురు, యోహానులను భిక్షమడిగెను. "నజరేయుడైన యేసు నామమున" ఆమనుష్యుడు స్వస్థత నొందెను. "వాడు దిగ్గున లేచి నిలిచి నడచెను, నడచుచు గంతులు వేయుచు, దేవుని స్తుతించుచు వారితో కూడా దేవాలయము లోనికి వెళ్లెను" (అపొ.కా. 3:8). ఈ అద్భుతమైన కార్యము ప్రజలు పేతురు యొద్దకు వెళ్లుటకు కారణమయ్యెను. పేతురు ఈ అవకాశమును వినియోగించుకొని వారికి యేసుని గూర్చి బోధించెను.

ఈ బోధలో పేతురు చాలా ఆసక్తికరమైన అంశమును బోధించెను. అపొ.కా. 3:15లో అతడు ఈ విధముగా అనెను.: "మీరు జీవాధిపతిని చంపితిరి గాని దేవుడు ఆయనను మృతులలోనుండి లేపెను. అందుకు మేము సాక్షులము". పేతురు చెప్పిన ఆసక్తికరమైన మాటలను మరియు విరుద్ధమైన భావములను గమనించండి.. "మీరు జీవాధిపతిని చంపితిరి".

మత్తయి 16:18లో యేసు ఈవిధముగా చెప్పెను: "ఈబండమీద నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు (మృత్యుబంధకములు) దాని యెదుట నిలువనేరవనెను". సంఘముపై మృత్యువుకు ఏవిధమైన శక్తిలేదని యేసు చెప్పెను. మృత్యువుపై యేసుక్రీస్తు యొక్క శక్తి ఆయన మాటతో చెప్పినపుడు కనబడెను. "పునరుత్థానమును జీవమును నేనే. నాయందు విశ్వాసముంచువాడు

చనిపోయినను బ్రతుకును. బ్రతికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడు ఎన్నటికి చనిపోడు" (యోహాను 11:24-26). యోహాను 10:10లో యేసు ఈవిధముగా చెప్పెను. "గొఱ్ఱెలకు జీవము కల్గుటకును అది సమృద్ధిగా కల్గుటకును నేను వచ్చితి నని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను". యోహాను 6:63లో యేసు ఈలాగు చెప్పెను: "నేను మీతో చెప్పు మాటలు ఆత్మయు జీవమునై యున్నవి".

ఆదికాండము 3:15లో "మరియు నీకును స్త్రీకిని నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తలమీద కొట్టును. నీవు దానిని మడిమె మీద కొట్టుదువు. ఇక్కడ మరణముపై విజయమును గూర్చి ప్రవచించినట్లుగా మనము చూడగలము (రోమా 1:4). "క్రీస్తు పరిశుద్ధమైన ఆత్మను బట్టి దేవుని కుమారునిగా ప్రభావముతో నిరూపింపబడెను.... ఎట్లనగా మృతులలోనుండి పునరుత్థానుడగుట ద్వారా". "నేను మొదటి వాడను కడపటివాడను జీవించువాడను మృతుడనైతిని గాని ఇదిగో యుగ యుగములు సజీవుడనై యున్నాను. మరణము యొక్కయు పాతాళము యొక్కయు తాళపుచెవులు నా స్వాధీనములోనున్నవి (ప్రక 1:18). జీవాధిపతిని చంపివేయుట ఎంత విరుద్ధము!

ఆ విజయము మనకు కూడా కలుగును. పౌలు ధైర్యముగా ఇట్లు చెప్పియున్నాడు: "మరణమా నీ విజయమెక్కడ? మరణమా నీ ముల్లెక్కడ? యేసుక్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగును గాక" (1కొరింథీ 15:55-57). కాబట్టి సహోదరులారా పరిశుద్ధమును దేవునికి అనుకూలమైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించు కొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను (రోమా 12:1).

- డాన్ వాకర్ ( **VOT** ).

# మతము

## ( Religion )

ప్రపంచములో ఈనాడు దాదాపు ఆరువందల మతములు ఉంటే, మతశాఖలు కోకొల్లలుగా ఉన్నాయి. పుట్టగొడుగుల్లా మరెన్నో పుట్టుకొస్తున్నాయి. ప్రతివారి సిద్ధాంతాలు వేరు. బోధనలు వేరు. ఆచరణలు వేరు. మతము అనుమాట పరిశుద్ధ గ్రంధమైన బైబిలులో మూడు పర్యాయాలు ఉదహరించబడింది (అపొ.కా. 13:43; గలతీ 1:13,14; యాకోబు 1:26,27). వాస్తవికతలో మతాలు రెండు. ఒకటి పవిత్ర మైనది. మరొకటి అపవిత్రమైనది. మరోలా చెప్పుకొంటే సత్యమైనది ఒకటి. అసత్యమైనది రెండోది. కొందరి దృష్టిలో అన్ని మతాలు యోగ్యమైనవే. ప్రతి దాంట్లోనూ ఎంతో కొంత మంచి ఉంది అంటారు. అన్ని మతాలు సత్యమై పవిత్ర మనవైతే యేసుక్రీస్తు మరెందుకు ఉన్నది కాదని మరొక దానిని రూపొందించారు? నిష్టాగరిష్టుడైన పౌలు యూదా మతాన్ని వీడి క్రైస్తవ్యం ఎందుకు స్వీకరించినట్టు? అన్ని మతాలు సత్యమైనవి కాదు. పవిత్రమైనవి అంతకంటే కాదు.

మానవ కల్పితాలైన మతాలు, మతశాఖలు ఈనాడు విజృంభించి ప్రజలను పెడదోవను పట్టిస్తున్నాయి. క్రీస్తు ప్రభోదించిన క్రైస్తవ్యం ప్రజల రక్షణకు, రానైయున్న లోకంలో నిత్యజీవనం గడపడానికి నీతిమార్గమైంది. యేసుక్రీస్తు క్రైస్తవ్యం రూపొందించారు (హెబ్రీ 5:9). క్రైస్తవ్యమనేది సత్య సంఘటనలపై కట్టబడింది. "అదేమనగా లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను. సమాధి చేయబడెను. లేఖనములు ప్రకారము మూడవ దినమున లేపబడెను" (1కొరింథీ 15:1-4). "..... మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" (మత్తయి 15:9) అని యేసుక్రీస్తు వారే నుడివారు. లేఖనముల ప్రకారము కాక క్రైస్తవ్యము పేరుతో ఈనాడు మతశాఖలు జరిపే బోధలు అసత్యములు కాక మరేమగును?

మతము అంటే ఆచరింపవలసినది. ఉదాహరణకు క్రీస్తు సెలవిచ్చిన రీతి, "ఆకలిగొన్న వారికి అన్నము పెట్టుడి, దిగంబరులకు వస్త్రదానము చేయుడి...."

(మత్తయి 25:33-46). అలాగే యాకోబు 1:27లో మతము అననేమో విశదముగా విపులీకరించబడింది. "తండ్రియైన దేవుని యెదుట పవిత్రమును, నిష్కళంకమునైన భక్తి (మతము) ఏదనగా దిక్కులేని పిల్లలను, విధవరాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించుటయు, ఇహలోక మాలిన్యము తనకంటకుండా తన్ను తాను కాపాడుకొనుటయునే".

ప్రియ చదువరీ! ఒకడు భక్తిగలవాడైనంత మాత్రాన వాడు క్రైస్తవుడు కానేరడు. క్రైస్తవుడగుటకు క్రీస్తు మార్గమునుసరించి అంగీకరించి ఆచరింపవలసియున్నది. ఆయనకు విధేయులై ఆయన చిత్తప్రకారము జీవించవలెను (లూకా 6:46). క్రైస్తవ్యము దైనందిన జీవితములో ఆచరిస్తూ జీవనం గడపాలే గానీ, "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గానీ, పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" (మత్తయి 7:21-26) అని యేసు చెప్పెను.

మతశాఖల మాటలు మాయాజాలంలో పడి పరలోక రాజ్య ప్రవేశము పోగొట్టుకొనవద్దు. నిత్యజీవములో ప్రవేశింప అర్హత గల్గించే క్రీస్తు మతమును ఆచరించి జీవితంలో ధన్యులు కండి.

- ఆర్. చెఖెసాంగ్, నాగాలాండ్.

## "నాకు టైమ్ లేదు!"

### ( I don't have Time )

దేవుని సేవింపకుండుటకు మానవులు అనాదినుండే సాకులు చెప్పుచునే యున్నారు. దేవుని సేవించుటకు ఆయనకు లోబడకుండా యుండుటకు చాలమంది, "నాకు టైమ్‌లేదండీ" యని సాకులు చెబుతారు. దేవుని గూర్చి వారికి టైమ్ లేనట్లే, వారిని గూర్చి దేవునికి టైమ్ లేకపోతే వారికి దుర్గతియే సంభవించును. మాకు టైమ్‌లేదని వారు చెప్పే కొన్ని సంగతులను, (సాకులను) దిగువ గమనించుదాం.

1. "దేవుని వాక్యాన్ని చదవడానికి నాకు టైమ్ లేదు": యిలా చెప్పేవారు వార్తాపత్రికలను గంటల తరబడీ తిరగవేస్తారు. మరియు సినీమాహాల్లోను, టివీ ముందు కూర్చుని ఎంత టైమైనా గడిపేస్తారు. అయితే క్రైస్తవులు దేవుని వాక్యాన్ని తప్పక చదవాలని బైబిలు బోధించుచున్నది. "నేను వచ్చువరకు చదువుట యందును, హెచ్చరించుటయందును, బోధించుట యందును జాగ్రత్తగా ఉండుము" (1తిమోతి 4:13). వారు క్రమముగా దేవుని వాక్యాన్ని చదవాలి (2తిమోతి 2:15; 2పేతురు1:5; యోహాను 12:48). క్రైస్తవులు దేవుని వాక్యాన్ని ధ్యానించాలి. "నేడు నేను నీకు ఆజ్ఞాపించు ఈ మాటలు నీ హృదయములో ఉండవలెను. నీవు నీ కుమారులకు వాటినిఅభ్యసింపజేసి. నీ యింట కూర్చుండునప్పుడును, త్రోవను నడుచునప్పుడును, పండుకొనునప్పుడును, లేచునప్పుడును వాటిని గూర్చి మాటలాడవలెను; సూచనగా వాటిని నీ చేతికి కట్టుకొనవలెను. అవి నీ కన్నుల నడుమ బాసికమువలె ఉండ వలెను. నీయింటి ద్వారబంధముల మీదను నీగవునుల మీదను వాటిని వ్రాయ వలెను" అని దేవుడు ఇశ్రాయేలీయులను ఆజ్ఞాపించెను (ద్వితీ 6:6-8). కీర్తన 1:1,2; 2తిమో 4:15 కూడా చదువుము. మన శరీరములకు ఆహారము ఎట్లవుసరమో, దేవుని వాక్యాన్ని చదువుట, ధ్యానించుట మన ఆత్మలకు అంత అవుసరము. దేవుని వాక్యాన్ని చదువుటకు సమయం లేదని చెప్పుట మనకు తగునా?

2. "పరిశుద్ధులతో కలిసి ఆరాధించుటకు నాకు టైమ్లేదు": యిలా చెప్పేవారు వారం దినములు తమ వృత్తులను చేసుకొనుటకు వారికి టైమ్ఉంటాది. అంతేకాదు తమ మిత్రులతో విలాసంగా కాలం గడిపేస్తు యుంటారు. గనుక ఈ జీవితంలో ఏది ప్రాముఖ్యమో ముందు నిర్ణయించుకోవాలి, సాంఘిక సంగతులా? లేక ఆత్మీయసంగతులా? పరిశుద్ధులతో సమాజముగా కూడుకొనుట యనునది ఒక ఆజ్ఞ (హెబ్రీ 10:24,25). ఆత్మీయముగా హెచ్చరింపబడుటకది అత్యవుసరము (హెబ్రీ 10:23-25). పరిశుద్ధులతో ఆరాధనకు కూడుకొనకపోతే కలుగు పర్యవసానము భయంకరము (హెబ్రీ 10:26-31; రోమా 6:23; యాకోబు 4:17). మనము వారానికి ఒకటి, రెండుమారులు కూడుకోవాలని ఆజ్ఞాపించుటలో దేవుడు అన్యాయస్థుడుకాడు. ప్రతివారంలోను 168 గంటల సమయమున్నది.

దానిలో ప్రతి ఆదివారం దేవునికి కనీసం రెండుగంటల సమయం కేటాయించలేమా? దేవుని కొరకు ఆ మాత్రం సమయం లేదని నీవు చెప్పుట సమంజసమా ?

3. **"యితరులకు సహాయం చేయడానికి నాకు సమయంలేదు":** అవుసరములలో యున్నవారికి సహాయపడాలని దేవుని గ్రంధము చెబుతున్నది (సామె 29:7; కీర్తన 82: 3,4; మత్తయి 25:31-36; గలతీ 6:10). మంచి సమరయుని కథనములో అవుసరములో యున్నవారికి మనం తప్పక సహాయపడాలని యేసు మనకు బోధించారు( లూకా 10:25-37). యాకోబు ఇట్లు చెప్పుచున్నాడు: "తండ్రియైన దేవుని యెదుట పవిత్రమును నిష్కళంకమునైన భక్తియేదనగా- దిక్కులేని పిల్లలను విధవరాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించుటయు, ఇహలోకమాలిన్యము తన కంటకుండ తన్నుతాను కాపాడు కొనుటయునే" (యాకోబు 1:27). బీదలకు సహాయపడుట ఎల్లప్పుడు ఉండును అని యేసు సూచించారు (మత్తయి 26:11). దేవుని బంగారు సూత్రమైన మత్తయి 7:12ను అనుసరించుటకు మనకు టైమ్‌లేదా?

4. **"నశించుపోవుచున్న వారికి సువార్త చెప్పుటకు నాకు టైమ్‌లేదు":** ఎవరో ఒకరు మనకు సువార్త నందించి యుండకపోతే మనం ఎక్కడ యుందుము? నశించిన వారిని వెదకి రక్షించుటకు యేసుక్రీస్తు ఈలోకమునకు వచ్చెను (లూకా 19:10). మనం ఆయన అడుగుజాడలలో నడవాలని ఆజ్ఞాపింపబడితిమి (1పేతురు 2:21; యోహాను 14:15). మనం సమస్త జనాంగములను యేసుకు శిష్యులనుగా చేయాలి (మత్తయి 28:18-20; మార్కు 16:15-16). "జ్ఞానము గలవారు ఇతరులను రక్షించుదురు" (సామె 11:30). గనుక సాకులు చెప్పుటమాని దేవుని పనిలో ముందుకు సాగుదాం.

- డగ్లస్ హేరిస్.

# వాక్య పరిచర్య
## ( Preaching )

ఆదిమ క్రైస్తవులు అపొస్తలుల బోధయందును సహవాసమందును రొట్టె విరుచుట యందును ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరని లేఖనములు చెబుతున్నాయి (అపొ.కా. 2:42). క్రైస్తవుల ఆరాధనలో వాక్యపరిచర్య లేక బోధ చేయుట ఒక ప్రాముఖ్యాంశము. వాక్యమును బోధించుటలో అనేకులు నిమగ్నులై యున్నారు. కొందరు ఖ్యాతిగాంచిన బోధకులు కావచ్చును, కొందరు చిన్న చిన్న గుంపులకు బోధించుచున్నవారు కావచ్చును. ఎట్లయినను వాక్యపరిచర్యయే వారి ముఖ్యోద్దేశము.

బోధకులందరికంటె గొప్పవాడు యేసుక్రీస్తు. ఆయన తరువాత అపొ.పౌలు ఒక గొప్ప బోధకునిగా క్రొత్త నిబంధనలో మనకు కన్పడుచున్నాడు. 1కొరింథీ 9:16లో, "సువార్తను ప్రకటింపవలసిన భారము నామీద మోపబడి యున్నది. అయ్యో నేను సువార్తను ప్రకటింపకపోయిన యెడల నాకు శ్రమ" యని అతడు చెప్పాడు. దేవుని వాక్యాన్ని బోధించుటవల్ల అతడు బాధింపబడ్డాడు. హింసింపబడ్డాడు. అయినను బోధించుట మాత్రం మానలేదు. ప్రతి సందర్భములోను అతడు బోధించేవాడు. విశ్రాంతి దినమున అతడు యూదుల సమాజ మందిరరములలోనికి వెళ్లి యేసుక్రీస్తును గూర్చి బోధించేవాడు. బహిరంగముగానే గాక, ఇంటింటను అతడు సువార్త ప్రకటించేవాడు. చివరకు సంకెళ్లతో బంధింపబడినను, క్రీస్తును గూర్చిన వాక్యాన్ని అతడు ప్రకటించుట ఎన్నడు మానలేదు.

పౌలు ప్రసంగాలలో యున్న వర్తమానం యేమిటి? గలతీ 1:11,12లో అతడిట్లు చెప్పుచున్నాడు: "సహోదరులారా, నేడు ప్రకటించిన సువార్త మనుష్యుని యోచన ప్రకారమైనది కాదని మీకు తెలియజెప్పుచున్నాను. మనుష్యునివలన దానిని నేను పొందలేదు; నాకెవడును దాని బోధింపనులేదుగాని యేసుక్రీస్తు బయలుపరచుటవలననే అది నాకు లభించినది". పౌలు ప్రకటించిన వర్తమానము

మనుష్యులది కాదు. క్రీస్తుచే అది అతనికి బయలుపరచబడినది. సువార్త ప్రకటించుచున్నామని చెప్పుకొనేవారనేకులున్నారు గాని వారు ప్రకటించేది క్రీస్తు సువార్త కాదని పౌలుకు తెలుసు. అందుకే, మేము ప్రకటించిన సువార్తగాక మరియొక సువార్తను మేమైనను పరలోకమునుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవునుగాక.... మీరు అంగీకరించిన సువార్తగాక మరియొకటి యెవడైనను మీకు ప్రకటించినయెడల వాడు శాపగ్రస్తుడవును గాక" యని అతడు చెప్పాడు (గలతీ 1:8,9). పౌలు ప్రకటించిన సువార్తగాక వేరొకదాన్ని ప్రకటిస్తే అది సువార్తకాదు.

రోమా 1:16లో పౌలు మరల యిట్లు చెప్పాడు: "సువార్తనుగూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి... రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది". సువార్తను గూర్చి అత్యున్నతమైన భావాన్ని అతడు కలిగియున్నాడు. ఆ సువార్తను మానవులు అంగీకరిస్తే దానివలన వారి జీవితాలు మార్చబడతాయని అతడెరుగును. మానవులు పాపములు క్షమింపబడి, రక్షింపబడే శక్తి సువార్తలో యున్నది.

సువార్త అంటే శుభవార్త, మంచివార్త అని యర్థము. ఏదైనా మంచివార్తను వినడానికి మనందరం సంతోషిస్తాము. చెడ్డవార్తను వినడానికి భయపడ్తాము. క్రీస్తు యొక్క మరణ సమాధి పునరుత్థానములను గూర్చిన వర్తమానమును విని విశ్వసించి దానికి లోబడేవానికది శుభ వర్తమానము. అది అతని రక్షించే మంచివార్త. గనుక ఈ మంచి వర్తమానము సర్వలోకానికి సర్వజనులకు ప్రకటింపబడాలని యేసుప్రభువు కోరుచున్నాడు (మార్కు 16:15).

పౌలు బోధలోయున్న మరియొక వాస్తవం-యేసుక్రీస్తు. దేవుని వలన మానవుడు అంగీకరించబడాలంటే అతడు క్రీస్తును అంగీకరించాలి. ఈలోకాన్ని వీడి క్రీస్తులోనికి అతడు రావాలి. ప్రతివాడు క్రీస్తుతో ముఖాముఖిగా రావలసి యున్నది. అయితే ఆయనను అంగీకరించాలి, లేదా నిరాకరించాలి. అందువలననే "ఇల్లు కట్టువారైన మీరు తృణీకరించిన రాయి ఆయనే; ఆ రాయి మూలకు

తల్లడిల్లాయి ఆయెను" అని అపో. పేతురు ఒక సందర్భములో చెప్పాడు. ఇంకో మాటలో యూదులు క్రీస్తును నిరాకరించినంత కాలము వారి మతములో కొంత భాగాన్ని వారు వదిలేసారు. క్రైస్తవ్యములో గొప్ప పరిపూర్ణత యున్నది. క్రీస్తు లేకుండా యేమీలేదు; గాని క్రీస్తులో అంతా యున్నది.

విగ్రహారాధన, దేవతార్చన చేయు కొరింథు పట్టణములో పౌలు క్రీస్తును గూర్చి ప్రకటించాడు. నాలుగు లేక అయిదు సంవత్సరముల తరువాత అక్కడున్న సంఘానికి ఈలాగ వ్రాసాడు: "సహోదరులారా, నేను మీ యొద్దకు వచ్చినప్పుడు వాక్చాతుర్యముతో గాని జ్ఞానాతిశయముతో గాని దేవుని మర్మమును మీకు ప్రకటించుచు వచ్చినవాడను కాను. నేను యేసుక్రీస్తును, అనగా సిలువ వేయబడిన యేసుక్రీస్తును తప్ప మరి దేనిని మీ మధ్యనెరుగకుందునని నిశ్చయించుకొంటిని... మీ విశ్వాసము మనుష్యుల జ్ఞానమును ఆధారము చేసికొనక, దేవుని శక్తిని ఆధారము చేసికొని యుండవలెనని, నేను మాటలాడినను సువార్త ప్రకటించినను జ్ఞానయుక్తమైన తియ్యని మాటలను వినియోగింపక, పరిశుద్ధాత్మయు దేవుని శక్తియు కనుబరచు దృష్టాంతములనే వినియోగించితిని" (1కొరింథీ 2:1-5).

గ్రీకులు వేదాంతులు, ఈలోక జ్ఞానంలో ఆరితేరినవారు. వారికి ఈలోక జ్ఞానానుసారమైన వేదాంతాన్ని బోధిస్తే అనేకులు పౌలును వెంబడించి యుండేవారు. అయితే పౌలు అట్లు చేయక సిలువ వేయబడిన క్రీస్తును తప్ప మరి దేనిని గూర్చి అతడు వారికి ప్రకటించలేదు. వారి విశ్వాసము దేవుని జ్ఞానానుసారం కావాలని అతడు కోరాడు. దేవుని ప్రేమయందు, విశ్వాసమునందు వేరుపారి స్థిరపడాలని అతడు కోరాడు.

క్రీస్తును గూర్చి మనం ఎంత తెలుసుకున్నా, ఇంకా తెలుసుకోవాలనిపిస్తాది. వినేకొలది వినాలనిపిస్తాది. ఈ లోక సంగతులు అనేకం మనం తెలుసుకొనే కంటే క్రీస్తును గూర్చి తెలుసుకొంటే అది మనకు లాభం.

చివరిగా, పౌలు రక్షించే దేవుని శక్తిని ప్రకటించు చున్నానని చెప్పాడు.

సువార్తలో దేవుని శక్తి యున్నది. నిజానికి సువార్త రక్షించడానికి దేవుని శక్తియై యున్నది. మనలను రక్షించేదే సువార్త. మనం విశ్వసించడానికి సువార్తలో వాస్తవములున్నవి. "నేను ఆయననని మీరు విశ్వసింపని యెడల మీరు మీ పాపములలోనే నశింతురని" యేసుప్రభువు చెప్పారు (యోహాను 8:24). మనం ఆయనయందు విశ్వాసముంచాలి. సువార్త వాక్యము ప్రకటించుట ద్వారా అవిశ్వాసులను విశ్వాసులుగా మార్చాలి. యేసు ఒక గొప్ప ప్రవక్తయని, సత్పురుషుడని మాత్రమే గాక, అన్నిటికంటే ముఖ్యంగా ఆయన దేవుని కుమారుడని విశ్వసించాలి. ఆయన దేవుని కుమారుడని మనం అంగీకరించనంత కాలము, ఆయనను నిజానికి అంగీకరించనేలేదు.

మనం లోబడేటట్లు సువార్తలో ఆజ్ఞలున్నవి. పెంతెకొస్తునాడు పేతురు ప్రసంగాన్ని విన్నవారు తాము పాపులమని గ్రహించారు. దేవుని కుమారుడైన క్రీస్తును సిలువ వేసిన అపరాధులమని వారు తెలుసుకొన్నారు. గనుక సహోదరులారా. మేమేమి చేయాలి? అని అడిగారు. మీరు మారుమనస్సు పొంది మీలో ప్రతివాడును పాపక్షమాపణ నిమిత్తము యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి యని వారికి చెప్పబడింది (అపొ.కా. 2:30). మనము విశ్వాసముంచుటయే గాక, మన పాపముల విషయమై మారుమనస్సు పొంది, బాప్తిస్మము పొందాలి. ఈవిధంగా సువార్తకు విధేయులమవ్వాలి.

సువార్తలో మనం ఆనందించేటట్లు అనేక దీవెనలున్నాయి. మన పాపములు క్షమింపబడ్డాయి, దేవుడు మనకు తోడుంటాడు, ఆయన సంఘములో యుండి ఆయనను ఆరాధిస్తాము, ఈ లోకానంతరము పరలోకంలో నిత్యము ఆయనతో జీవింపగలము అనే వాగ్దానాలు ఎన్నో క్రీస్తు సువార్తలో యున్నవి. అందుకే ఆయన సువార్త సమయమందును, అసమయమందును ప్రకటింపబడుచున్నది. వాక్య ప్రకటన క్రైస్తవారాధనలోను, క్రైస్తవ జీవితంలోను వేరు చేయబడని ఒక భాగం !!

- జాషువా గూటం.

## అర్పణలు
## ( Offerings )

"గ్రుడ్డి దానిని తీసికొని బలిగా అర్పించిన యెడల అది దోషముకాదా? కుంటి దానినైనను రోగముగల దానినైనను అర్పించిన యెడల అది దోషముకాదా? అట్టివాటిని నీ యధికారికి నీవిచ్చిన యెడల అతడు నీకు దయచూపునా? నిన్ను అంగీకరించునా? అని సైన్యములకు అధిపతియైన యెహోవా అడుగుచున్నాడు. దేవుడు మనకు కటాక్షము చూపునట్లు ఆయనను శాంతి పరచుడి; మీచేతనే గదా అది జరిగెను? ఆయన మిమ్మును బట్టి యెవరినైన అంగీకరించువా? అని సైన్యములకు అధిపతియగు యెహోవా అడుగుచున్నాడు" (మలాకీ 1:8-9).

క్రైస్తవులు క్రీస్తుయేసు నందు రాజులైన యాజక సమూహమై యున్నారు (1పేతురు 2:9; ప్రక 1:6; 20:6). పాతనిబంధన నుండి మనము విలువ గల పాఠములను నేర్చుకొనవచ్చును (రోమా 15:4; 1కొరింథీ 10:11). అయితే పాత నిబంధనలో వలెగాక జంతుబలులు అర్పించుడి యని క్రొత్త నిబంధన బోధించుట లేదు (హెబ్రీ 10:4). క్రీస్తు రక్తము ద్వారా మాత్రమే మనము శుద్ధి యగుదుము (మత్తయి 26:28; రోమా 5:9; కొలస్స 1:18-20; హెబ్రీ 9:8-14; 10:19-22; 1పేతురు 1:18-19; 1యోహాను 1:7). అయితే యాజకులముగా మన శరీరములను సజీవయాగముగా దేవునికి అర్పించుకోవాలి (రోమా 12:1). మరియు పవిత్ర జీవితాన్ని జీవించాలి (1పేతురు 1:15-16). దేవుని పనికి అంగీకారయోగ్యమైన బలిగా కానుకలర్పించాలి. మన ఆత్మీయ సోదరులకు సహాయపడుచు, సహవాసము చేయాలి (ఫిలిప్పీ 4:16-18; హెబ్రీ 13:16). మరియు దేవునికి స్తుతియాగము చేయుచు మన జిహ్వాఫలమర్పించాలి (హెబ్రీ 13:15).

యివి కేవలము భౌతిక సంబంధక్రియలు కావు. అవి ఆత్మీయ కానుకలు. అవి ఆత్మీయమైనవి గనుక మన భక్తి ప్రేమల చొప్పున పురికొల్పబడాలి (హెబ్రీ 11:6; ఎఫెసీ 5:2; గలతీ 5:6). దేవునికి అంగీకారయోగ్యమైన సత్యారాధన కేవలం

భౌతిక సంబంధక్రియలు మాత్రమే కాదు. "దేవుడు ఆత్మగనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించాలి" (యోహాను 4:24).

మన మనస్సాక్షి ఈ దిగువ ప్రశ్నలను తరుచు వేస్తూ యుండాలి. దేవునికి మచ్చగల బలులనర్పించు చున్నావా? విశ్వాసప్రేమల వలన నేను సత్‌క్రియలు చేయుచున్నానా? ఆరాధనకు కూడివచ్చినప్పుడు ఆలోచన పూర్వకముగా పాటలు పాడుచు, ప్రార్థించుచు, వాక్యమును వినుచు, ప్రభురాత్రి భోజనములో పాలు పొందుచు, కానుకలిచ్చుచు యున్నానా? నేను దేవునికి చేయు స్తుతియాగము ఆత్మతో, విధేయతతో నిష్కపటముగా చేయుచున్నానా?

మనము ఆత్మీయ యాజకులము. మన అర్పణలు గ్రుడ్డివి, కుంటివి, రోగిష్టివి యైన క్రియలు కాకూడదు. మనము యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మసంబంధమైన అర్పణలర్పించాలి (1పేతురు 2:5). ఈ విధముగా మనం మన చేతులు పెదవుల ద్వారా చేయుచున్నను, వాటిని ఆయన అంగీకరించును.

"నేను ఘనమైన మహారాజునై యున్నాను. అన్యజనులలో నా నామము భయంకరమైనదిగా ఎంచబడుచున్నదని సైన్యముల కధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు. కాబట్టి తన మందలో మగది యుండగా యెహోవాకు మ్రొక్కుబడి చేసి చెడపోయినదానిని అర్పించువంచకుడు శాపగ్రస్థుడు" (మలాకీ 1:14).

**- J.J లైఫిష్టి, Lufkin ( IGT ).**

## ఏషియన్ బైబిల్ లెక్చర్‌షిప్

డిశంబరులో జరుగబోవుచున్న ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్‌కు హాజరగుకును అనేకులు సంసిద్ధతను వెల్లడి పర్చుచు ఉత్తరాలు వ్రాయుచున్నారు. వారందరికీ వ్యక్తిగతముగా జవాబు వ్రాయలేము గనుక ఈ పత్రికా ముఖముగానే సంప్రదించెదము.

ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్‌లో ప్రసంగించుటకు గాను కనీసం 10దేశముల నుండి గొప్ప సువార్తికులు వచ్చుచున్నారు. దానిలో హాజరు కావాలనుకొన్న వారికి భోజన వసతులు ఉచితముగానే లభింపచేయుటకు ప్రయత్నించుచున్నాము. కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ భవన సముదాయము నందును, సత్యవాణి కార్యాలయమునందును వసతి ఏర్పరచబడును. రానుపోను ఖర్చులు ఎవరివి వారే భరించుకొనవలెను.

ఇంకా ప్రత్యేక వసతి వలయు వారు కాకినాడ పట్టణములో గల వివిధ లాడ్జింగ్‌లలో తమ స్వంత ఖర్చుల చొప్పుననే యుండ వచ్చును. మేము కల్పించు ఉచిత వసతిని వినియోగించుకొనదలచిన వారు శీతాకాలమునకు తగినట్లు దుప్పటిని, బెడ్డింగ్ వగయిరా తెచ్చుకొనవలెను. లెక్చర్‌షిప్ సమయములో బైబిళ్లు, కీర్తనపుస్తకములు తగు మాత్రపు ధరకు విక్రయించబడును. మీ స్థానిక సంఘములనుండి చందాలు పోగుచేసి మీ దారి ఖర్చులకొరకు ఏర్పరచుకొనండి. లెక్చర్‌షిప్ ఖర్చుల కొరకు విరాళములు అందించ గలిగితే మంచిది.

లెక్చర్‌షిప్ సమయములో తగు వాతావరణము కొరకు ప్రార్థించండి. అనేక ప్రాంతములనుండియు దూరదేశములనుండియు దీనిలో హాజరగుటకు వచ్చుచున్నవారి కొరకు మీరు వ్యక్తిగతముగాను సంఘపరముగాను ప్రార్థించండి. అనేక ఆత్మలు ఆ సమయములో క్రీస్తుకొరకు సంపాదించబడునట్లు ప్రార్థించండి. మీ సంఘమునుండి పెక్కుమంది ఈ కూటములకు హాజరగుటకు ప్రయత్నము చేయండి.

# 13వ ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్ మరియు
# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ బైబిలు సెమినార్

## ఆహ్వానము

తేదీలు : **1997 డిశంబరు 7 నుండి 12 వరకు**
ఆదివారం నుండి శుక్రవారం వరకు

స్థలము : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ - సెమినార్ హాలు
ఫోర్డ్ స్ట్రీట్, విద్యుత్‌నగర్, కాకినాడ - 533 003.

ముఖ్యాంశము : "యేసుక్రీస్తు దేవుని కుమారుడు"
**Theme** : **"Jesus Christ, the Son of God"**

గత 12 సంవత్సరములుగా ఆసియా ఖండములో వేర్వేరు దేశములలో జరుగుచున్న లెక్చర్‌షిప్ ఈ సంవత్సరము భారతదేశములో పైనుదహరించిన తేదీలలో జరుగబోవు చున్నది. ఆసియాలోని 10 లేక 14 దేశములనుండి వచ్చిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సువార్తికులు "యేసుక్రీస్తు దేవుని కుమారుడు" అనే అంశముపై గొప్ప ప్రసంగముల నందించబోవుచున్నారు. మరియు భారతదేశమునుండి ఇంచుమించు అన్ని రాష్ట్రముల వారు ఇందు పాల్గొనబోవుచున్నారు. యిది మన జీవితములో సంభవింపబోవుచున్న గొప్ప ఆనందదాయకమైన సమయం, సహవాసం. గనుక ఇందులో పాల్గొనుటకు ఇప్పటినుండి సిద్ధపడండి. ప్రార్ధన చేయండి. వివరములకు ఈ దిగువ సంప్రదించండి.

నెహెమ్యా గూటం
**Convenor of the Seminar**
**P. O. Box. 57,**
**Kakinada - 533 001**
**Ph : 0884 - 64882 / 72604.**

జాషువా గూటం
**Director of the Lectureship**
**P. O. Box. 80,**
**Kakinada - 533 001**
**Ph : 0884 - 63697 / 63722.**

సోదరులు హెర్షల్ బియర్డెన్, హోవెల్ ఫెర్గుసన్, రోయస్ ఫ్రెడరిక్, ఆర్. సమూయేలు, బి. ధర్మరాజు, పి. ప్రకాశం గార్లు చక్కని వర్తమానముల నందించిరి.

ప్రవక్తయైన యోనాను గూర్చి 2రాజులు 14:25 నందు మొదట వ్రాయబడింది. యోనా ప్రవక్త మరియు సువార్తికుడు. అతడు మొదట దేవుని ఆజ్ఞను నిరాకరించినను తరువాత నీనెవె పట్టణపు వారికి సువార్త ప్రకటించెను. దేవుని ఆజ్ఞను అతడు ఎప్పుడైతే నిరాకరించెనో అప్పుడు ప్రమాదములో పడెను. 3దినములు మత్స్యము గర్భములో నుండవలసి వచ్చెను. చీకటిలో, దుర్వాసనలో, దయనీయమైన స్థితిలో నుండినను ప్రార్థన చేయుచు గడిపెను. మత్స్యము అతనిని నేలమీద కక్కిన తరువాత అతని రూపము, అతని స్థితిని గూర్చి ఆలోచించిన విచిత్రముగ కనిపించును. ఇదే పాపము యొక్క పర్యవసానము. అతడు తరువాత నీనెవె పురమునకు దేవుని యొక్క వాక్యమును ప్రకటించెను. దేవుని చిత్తమును ప్రకటించినపుడే ఒకడు గొప్ప సువార్తికుడు కాగలడు. దేవుడు అందరినీ ప్రేమించుచున్నాడనునదియే యోనా గ్రంథము యొక్క సారాంశమని హెర్షల్ బియర్డెన్ గారు బోధించిరి.

సోదరులు హోవెల్ ఫెర్గుసన్ గారు మాట్లాడుచు ఈ క్రింది విషయములు బోధించిరి. "నయమాను యొక్క వ్యాధి మిక్కిలి దయనీయమైనది అతడు తన వ్యాధినుండి విడుదల పొందుటకు దేవుని చిత్తముపై గాక తన మనోభావముపై ఆధారపడెను (2రాజులు 5:11). కాని దేవుని సంకల్ప ప్రకారమే అతడు ఆశ్చర్యకరమైన స్వస్థత పొందెను". మనోభావాలపై ఆధారపడక దేవుని వాక్యమునకు విధేయుడగుట ద్వారా ఒకడు రక్షింపబడునని హెచ్చరించిరి.

"ఆమోసు 6:4 నందు యిట్లు వ్రాయబడినది: దంతపుమంచముల మీద పరుండుచు, పాన్పుల మీద తమ్మును చాచుకొనుచు, మందలో శ్రేష్టమైన గొఱ్ఱెపిల్లలను... వధించి భోజనము చేయుదురు" వారు "యోసేపు సంతతి వారికి కలిగిన ఉపద్రవమును గూర్చి చింతపడరు". దంతపు మంచము మీద పరుండుట, గొఱ్ఱెలను వధించి భోజనము చేయుట పాపము కాదుగాని, సోదరులు శ్రమపడు చుండగా వారినిచూడకుండ సౌఖ్యము అనుభవించుచున్న వారి స్వార్థమును ఈ వచన భాగాల్లో ఆమోసు ఖండించెను. పాతనిబంధనలో వాద్యములను దేవుడు

అనుమతించెను. ఆమోసు 6:5పాతనిబంధన కాలంలో వాద్యసంగీతమును గాక స్వార్థపూరితమైన వారి స్వభావమును ఖండించెను. క్రొత్తనిబంధన ఆరాధనలో వాద్యసంగీతము అనుమతింప బడలేదు". అని రోయస్ ఫ్రెడరిక్ గారు చక్కగా వివరించిరి.

సోదరులు సంఘమును గూర్చి, సువార్తికుని బాధ్యతలను గూర్చి, మంచి క్రైస్తవజీవితమును గూర్చి, క్రీస్తు ప్రేమను గూర్చి, క్రీస్తు ఉపదేశమును గూర్చి, వాక్యము యొక్క శక్తిని గూర్చి చక్కని వర్తమానములను అందించిరి.

కాకినాడ స్కూల్ ఆఫ్‌ప్రీచింగ్ డైరక్టర్ నెహెమ్యాగూటం గారు సువార్తికు లందరికీ చక్కటి భోజన పానీయముల నేర్పరచిరి. మరియు డిశంబరు 7నుండి 12 వరకు జరుగు గొప్ప బైబిలు లెక్చర్‌షిప్ మరియు సెమినార్‌లో అందరూ పాల్గొనాలని హెచ్చరించిరి.

---

Regd. No. H / KD-45 / K.H.H.O
Date of Posting : 15th of Every month

From:
SATYA WAKKU
P.O. BOX 80
KAKINADA - 533 001

To